క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

అల్లిపురం : ప్రజారోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య శ్రీ పథకాన్ని మరింత మెరుగుపరిచి, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచారు. దీంట్లో భాగంగా కొత్త ఆరోగ్య శ్రీ కార్డులను ఆరోగ్య శ్రీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేస్తున్నారు. జీవీఎంసీ 33వ వార్డు గౌరీ స్ట్రీట్ సచివాలయం పరిధిలో శుక్రవారం ఏఎస్ఎం ఎం.భారతి, వలంటీర్ వీసం నాగలక్ష్మి, సచివాలయం కార్యదర్శి కిరణ్‌కుమార్ ఆరోగ్య శ్రీ కార్డులు అందజేశారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతలు సమర్పిస్తారు.

చెట్టును ఢీకొన్న బైక్.. ఒకరు మృతి

కూర్మన్నపాలెం: బైక్ అదుపు చేయలేక చెట్టుకు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలివీ.. కూర్మన్నపాలెం రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన చింతలపాటి మోహన్‌కుమార్(33) పరవాడలోని ఠాగూర్ లేబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో అసిస్టెంట్ ప్రొడక్షన్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. గురువారం జనరల్ షిఫ్ట్ డ్యూటీకి వెళ్లిన మోహన్ అనారోగ్యం కారణంగా మధ్యాహ్నం అనుమతి తీసుకుని ఇంటికి తిరిగి వచ్చేశాడు. రాత్రి స్నేహితుడి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి బైక్‌పై బయలుదేరాడు. తిరిగి అర్ధరాత్రి సమయంలో అగనంపూడి నుంచి రాజీవ్‌నగర్ వైపు బయలుదేరాడు. ఈ క్రమంలో తాను నడుపుతున్న బైక్‌ను అదుపు చేయలేక చెట్టును ఢీకొనడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ఈ ఘటనలో మోహన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుల ద్వారా సమాచారం అందుకున్న భార్య స్రవంతి.. భర్త మృతదేహాన్ని చూసి బోరున విలపించింది. ఆమె ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరికి ఐదు నెలల పాప ఉంది.

ప్రజాభీష్టమే.. పరమావధి

- ప్రజలు కోరింది తక్షణం చేయమని సీఎం జగన్ చెప్పారు
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- 32, 36 వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



30, 36 వార్డులకు సంబంధించి సీసీ రోడ్ల పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



32వ వార్డులో కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : ప్రజా అవసరాలు ఏవైతే తక్షణమే వాటిని అందివ్వడమే నాయకత్వ లక్షణమని.. జగనన్న మాకు నేర్పింది కూడా అదేనని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పష్టం చేశారు. 36వ వార్డులో కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం వార్డు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం స్థానికుల అభ్యర్థన మేరకు రూ.10.20 లక్షలతో ద్వారంవీధి, రూ.15 లక్షలతో కొత్తసాలిపేట వీధి సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. అడిగిన వెంటనే.. వారంలోనే నిధులు విడుదల చేసిన నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి కృతజ్ఞతలు తెలిపారు. సీసీ రోడ్లు త్వరలో అందుబాటులోకి రానున్నాయని,నియోజకవర్గంలో ప్రతి వార్డుకి సుమారు రూ.10 కోట్ల పైనే నిధులు విడుదలయ్యాయని, ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన నిర్మాణాలు మినహా మిగిలిన పనులు కూడా నెలలోనే అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో 36వ వార్డు నాయకుడు మాసిపోగు రాజు, పార్టీ నాయకులు పి. సత్యనారాయణ, పలు ఆలయాల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపథంలో..

అల్లిపురం : రూ. వందలాది కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి పాత నగరం రూపు రేఖలు మార్చబోతున్నామని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 32వ వార్డులో రూ.80.78 లక్షల అంచనా వ్యయంతో నూతన కల్యాణ మండప నిర్మాణానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి వార్డులో రూ.10 కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. అదనంగా రోడ్లు, డ్రైనేజీలు, సత్యనారాయణ స్వామి ఆలయానికి రోడ్డు నిర్మాణం, జగదాంబ నుండి పాత పోస్టాఫీసు వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులు, ఇందిర ప్రియదర్శిని స్టేడియం ఆధునికీకరణ వంటి అనేక పనులు వేగవంతమయ్యాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో తాను అందించగలుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమమే 2024లో గెలిపిస్తాయన్నారు. రానున్న ఎలక్షన్లకు తాము సంసిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు మూలే రామిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సురపతి అప్పన్న, బోణిదేవ, జీవీఎంసీ అధికారులు, వార్డు కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించండి

- జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ విశ్వనాథన్

దాబాగార్డెన్స్ : పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీలు విశాఖ వేదికగా నిర్వహిస్తుందని జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో క్రీడలకు సంబంధించి ఏర్పాటు చేసిన పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 13 వరకు పోటీల్లో పాల్గొనేందుకు విచ్చేస్తున్న క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, అన్ని సదుపాయాలు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి ఎందరో క్రీడాకారులు నగరానికి వస్తున్నందున వారికి స్వాగతం పలికే బోర్డులతో పాటు సదుపాయాలకు సంబంధించిన సూచిక బోర్డులు, హోర్డింగులు, బిల్‌బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, అలాగే క్రీడాకారులకు తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సదుపాయం తదితర వాటిని ఏర్పాటు చేయాలని, మహిళా క్రీడాకారులకు ఆంధ్రా యూనివర్సిటీ మహిళా హాస్టల్లో ఏర్పాటు చేసిన వసతుల్లో ఎటువంటి లోపం లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని జోనల్ కమిషనర్ బంటు సన్యాసినాయుడును ఆదేశించారు. పర్యటనలో పట్టణ ప్రణాళికాధికారి సురేష్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఏఎంవోహెచ్ డాక్టర్ రాజేష్, తాగునీటి విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ



అల్లిపురం న్యూ స్కూల్లో చిన్నారులతో మాత్రలు మింగిస్తున్న ఏఎన్ఎం



అంగన్‌వాడీ చిన్నారుల చేత మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది

అల్లిపురం : జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం అంగన్‌వాడీ పిల్లలకు, పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని కొబ్బరితోట యూపీహెచ్‌సీ, భీమ్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలో ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి మాత్రలు అందజేశారు. కుమ్మరవీధి సచివాలయం ఆవరణలో గల అంగన్‌వాడీ కేంద్రం, అమ్మవారివీధి, బంగారుమెట్ట, అంగన్‌వాడీ కేంద్రాలోని చిన్న పిల్లలకు 1 నుంచి 19 ఏళ్ల వారికి ఒక టాబ్లెట్ చొప్పున వైద్య సిబ్బంది అందజేశారు. అదే విధంగా బంగారుమెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్, మోడల్ స్కూల్, అచ్చియ్యమ్మపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కొబ్బరితోట యూపీహెచ్‌సీ సిబ్బంది మాత్రలు అందజేశారు. 33వ వార్డులో జరిగిన కార్యక్రమంలో ఏఎన్ఎం సుభాషిని, అల్లిపురం న్యూ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు అరుణలక్ష్మి, ఉపాధ్యాయులు వినోద్, రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల శ్రీహరిరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి అంగన్‌వాడీ కార్యకర్త సరిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



జామియా మసీదు వద్ద అగ్నిప్రమాద బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



అచ్చియ్యమ్మపేట వద్ద ప్రజల నుంచి వినతులు తీసుకుంటున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 32,33,34 వార్డులకు సంబంధించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత నిధులతో ప్రతివారం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితులకు రూ.3.65లక్షలు అందజేత..

పేదలకు జగనన్న అందించే పాలన వెలకట్టలేనిదని ఎమ్మెల్యే వాసుపల్లి గణేషకుమార్ అన్నారు. 36వ వార్డు జామియా మసీదు వద్ద జరిగిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని ఫిషింగ్ హార్బర్ అగ్నిప్రమాద బాధితులకు రూ.3.65 లక్షల పరిహారం చెక్కులు అందించారు. మత్స్యశాఖ సహాయ తనిఖీ అధికారి (ఏడీ) ఎం.విజయకృష్ణ, అభివృద్ధి అధికారి (ఎఫ్‌డీవో) ఎం.ఆర్.ఆశాజ్యోతి, కార్పొరేటర్లు, స్టేట్ డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్‌కు అభినందనలు



జెడ్సీ సన్యాసినాయుడిని అభినందిస్తున్న పద్మావతి, శ్రీనివాసరావు

అల్లిపురం : జోన్–4 జోనల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సన్యాసినాయుడిని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతితో పాటు వార్డు సీనియర్ నాయకుడు, మాజీ టర్నర్ చౌల్ట్రీ చైర్మన్ లింగం శ్రీనివాసరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరారు.

అభాగ్యులకు ఆశ్రయం



అభాగ్యులను పెందుర్తి లయోలా హోమ్‌లో చేర్పిస్తున్న ప్రగడ వాసు

అల్లిపురం : గత ఏడాది జూలై 17వ తేదీన కేజీహెచ్ సమీపంలో రోడ్డుపై దీనస్థితిలో ఉన్న సూర్యప్రకాష్ అనే 65 సంవత్సరాల వృద్ధుడిని దిశ పోలీసులు రక్షణ కల్పించి ఏయూటీడీ షెల్టర్‌లో అప్పగించారు. అదే విధంగా గత ఏడాది మార్చి 13వ తేదీన తక్కుస్ అనే 38 సంవత్సరాల వ్యక్తిని ఏయూటీడీ సిబ్బంది గుర్తించి మానసిక వైద్యశాలలో చేర్పించి చికిత్స అందజేశారు. అతని ఆరోగ్యం మెరుగుపడటంతో షెల్టర్లో ఆశ్రయం కల్పించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీన అక్కయ్యపాలెం వద్ద రామస్వామి, 70 సంవత్సరాల వ్యక్తిని ఫోర్తుటౌన్ పోలీసులు వసతి గృహంలో చేర్పించారు. వీరు ముగ్గురు కదల్లేని స్థితిలో ఉండటంతో వారిని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు శుక్రవారం పెందుర్తి లయోలా హోమ్‌లో చేర్పించి ఆశ్రయం కల్పించారు.

మెగా స్పోర్ట్స్ కార్నివాల్ విజయవంతం కావాలి



మెగా స్పోర్ట్స్ కార్నివాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల సిబ్బందితో నిర్వహించే మెగా స్పోర్ట్స్ కార్నివాల్ విజయవంతం కావాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆకాంక్షించారు. ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న క్రీడల పోటీల పోస్టర్‌ను నిర్వాహకులు శుక్రవారం జామియా మసీదు వద్ద జరుగుతన్న ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేచే ఆవిష్కరింపజేశారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే వైద్యులు, సిబ్బందికి ఈ క్రీడల ద్వారా చక్కటి మానసిక ఉత్సాహం లభిస్తుందన్నారు. అందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అమృతరాజు, యోగేంద్ర, భవాని, వరలక్ష్మి, లక్ష్మి సేహనాథ్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నాయీ బ్రాహ్మణుల సేవా సంఘం రాష్ట్ర క్యాలెంటర్‌ను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. వృత్తిని నమ్ముకున్న నాయీ బ్రాహ్మణులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేశారన్నారు. సంఘం నగర అధ్యక్షుడు అతవ సుబ్బారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ వి. త్రినాథరావు, జోనల్ కార్యదర్శి టి.చిన్న, ఉపాధ్యక్షుడు పి. కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

13 వరకు వస్త్ర ప్రదర్శన



ప్రదర్శనలో మోడల్

దాబాగార్డెన్స్: వివాహ సీజన్ పురస్కరించుకొని నేషన్ సిల్క్ ఎక్స్‌పో ఈ నెల 13వరకు నగరంలోని హోటల్ గ్రీన్ పార్క్‌లో భారీ వస్త్ర ప్రదర్శన నిర్వహిస్తోంది. ఎక్స్‌పోలో అద్భుతమైన ఎత్నిక్ వస్త్రాలు, సంప్రదాయ సిద్ధమైన ప్రింట్లు అందుబాటులోకి తెచ్చినట్టు నిర్వాహకులు తెలిపారు. ఎక్స్‌పోలో ఎన్నో రకాల చీరలు, సల్వార్‌లు, టాప్‌లు, లెనిన్ వస్త్రాలు సంప్రదాయతను ప్రతిబింబించే వస్త్రాలు అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. పోచంపల్లి, కలంకారి చీరల నుంచి కోల్‌కతా, భాగలపురి ప్రింట్లు, లక్నో చికాన్ వర్క్, బెనారస్ సిల్క్, చేనేత, రంగులు అద్దిన ప్రింట్లు, ఎంబ్రాయిడరీ చేసిన వస్త్రాలు, సరికొత్త కలెక్షన్స్ ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

డాక్టర్ చైతన్యకు బంగారు పతకం



బంగారు పతకం, సర్టిఫికెట్ అందజేస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, రిటైర్డ్ డీఎంఈ డాక్టర్ శశిప్రభ

మహారాణిపేట: 2023 సంవత్సరానికి సంబంధించి ప్రసూతి,గైనకాలజీ విభాగంలో యూనివర్సిటీ పీజీ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించినందుకు గాను ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శారదా బాయి పేరిట ఉన్న బంగారు పతకాన్ని డాక్టర్ మాధురీ చైతన్యకు శుక్రవారం అందజేశారు. ఆంధ్ర వైద్య కళాశాలల్లో ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శారదాబాయి ఏఎంసీ పూర్వ విద్యార్థిని, గైనిక్ విభాగాధిపతిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. డాక్టర్ శారదా బాయి అకాల మరణంతో ఆమె కుటుంబం శారదా బాయి పేరిట బంగారు పతకాన్ని నెలకొల్పారు. పీజీ పరీక్షల్లో అత్యధిక మార్కులు పొందిన డాక్టర్ మాధూరి చైతన్యకు మాజీ డీఎంఈ డాక్టర్ శశిప్రభ, ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు బంగారు పతకాన్ని, సర్టిఫికేట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.మధుసూదనబాబు, కేజీహెచ్ గైనిక్ విభాధిపతి డాక్టర్ కెవీఎస్ఎం సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ట్రాన్స్‌పోర్ట్ జై భీమ్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఏర్పాటు



ఆర్ఎంను కలిసిన ఏపీ ట్రాన్స్‌పోర్ట్ జై భీమ్ అసోసియేషన్

దాబాగార్డెన్స్: విశాఖ జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంట్ అధికారి అప్పలరాజును ఏపీ ట్రాన్స్‌పోర్ట్ జై భీమ్ అసోసియేషన్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి .కిరణ్ బుజ్జి, ప్రధాన కార్యదర్శి బీవీఎస్ నారాయణ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ జైభీమ్ అసోసియేషన్‌గా రిజిస్ట్రేషన్ చేయడమైందని చెప్పారు. ఈ సందర్భంగా నూతన కమిటీని వారు ప్రకటించారు. అసోసియేషన్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా ఎన్ చిరంజీవి, కార్యదర్శిగా యల్లపు రాంబాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె గురయ్య, ఉపాధ్యక్షుడిగా కె అర్జున్, కోశాధికారిగా కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా జి సోములు పలువురు సభ్యులను ప్రకటించారు. నూతన కార్యవర్గాన్ని విశాఖ జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంట్ అధికారి ఏ అప్పలరాజుకు పరిచయం చేశారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు, నూతనంగా ఏర్పాటైన జిల్లా కమిటీ దాబాగార్డెన్స్‌లోని బాబా సాహెబ్ అంబేద్కర్‌కు నివాళులర్పించింది

దేశ చరిత్రలో పీవీ స్థానం పదిలం



శంకర్ నీలు

మహారాణిపేట : దివంగత ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారం ప్రకటించడం ముదావహమని భారత జాతి పునరుజ్జీవశక్తి పుస్తక రచయిత భాగవతుల శంకర్ నీలు తెలిపారు. పురస్కార ప్రకటనపై హర్షం వ్యక్తం చేశారు. 20వ శతాబ్దంలో జన్మించిన గొప్ప మేధావుల్లో పీవీ ఒకరని కొనియాడారు. ప్రతికూల అంశాలను కూడా తనకు అనుకూలంగా మార్చుకునే గొప్ప నేర్పరి పీవీ అన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలి



దీక్షలో పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

సీతమ్మధార : ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం కాకుండా కాపాడుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఐఎస్ఎఫ్ నాయకులు నాగరాజు అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే దీక్షలు శుక్రవారం నాటికి 1,044వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను విదేశీ, స్వదేశీ పెట్టుబడు దారులకు అమ్మేయాలని చూడడం అవివేకమన్నారు. ఇప్పటికైన మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చరణ్,మధు, తదితరులు పాల్గొన్నారు.

456 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: పెందుర్తి మండలం రాంపురం పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 456 మంది రోగులు పేర్లు నమోదు చేసుకున్నారు. గైనకాలజిస్టు,జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్,డెంటల్ వైద్యులు సేవలందించారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. వైద్య సేవల అనంతరం రోగులకు ఉచితంగా మందులు ఇచ్చామన్నారు. వైద్య శిబిరాన్ని నోడల్ అధికారి డాక్టర్ ఉమావతి సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

విద్యాశాఖ మంత్రిని కలిసిన యూనిట్ టీం

అక్కిరెడ్డిపాలెం: సమగ్ర శిక్షలోని పార్ట్ టైం టీచర్లను ఒకేషనల్ టీచర్లుగా మార్పు చేస్తున్నట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారని జిల్లా యూనిట్ టీం అధ్యక్షుడు రవిచంద్ చెప్పారు. అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. 23 శాతం జీతం పెరుగుదల జీవో విడుదల చేసిన సందర్భంగా ఆయనతో పాటు యూనిట్ టీం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శంకర్, జిల్లా యూనిట్ టీం కార్యదర్శి కె.శ్రీనివాసరావు మంత్రిని కలిసి ధన్యవాదాలుచెప్పారు. ఉపాధ్యాయుల మిగిలిన అంశాలు కూడా త్వరలో పరిష్కరిస్తామని మంత్రి చెప్పినట్లు రవిచంద్ ఓ ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్షలు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ-చెన్నై ఆధ్వర్యంలో నిర్వహించే లోయర్, హయ్యర్ హిందీ పరీక్షలు శని, ఆదివారాల్లో భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో జరగనున్నాయి. రెండు రోజుల పాటు హయ్యర్ పరీక్షలతో పాటు వైవా జరుగగా ఆదివారం లోయర్ విద్యార్థులకు పరీక్షలు జరుగనున్నాయి. ఈ పరీక్షలకు గాను పూర్తిగా ఏర్పాట్లు చేసినట్టు ప్రధానోపాధ్యాయురాలు ఎం.తిరుమల శ్రీదేవి తెలిపారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లు కూడా పంపిణీ చేశారు.

వెట్టిచాకిరీ నిర్మూలనకు కృషి చేయాలి

మహారాణిపేట: వెట్టిచాకిరీ పద్ధతి నిర్మూలనకు సంబంధిత విభాగాల అధికారులు కృషి చేయాలని, బాండెడ్ లేబర్ సిస్టమ్– 1976ను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి. శేషమ్మ సూచించారు. శుక్రవారం సాయంత్రం న్యాయ సేవా సదన్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన వెట్టిచాకిరీ నిర్మూలన దినోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాండెడ్ లేబర్ పద్ధతిని అంతం చేయడానికి, వివిధ రకాల కట్టుబానిసల నుంచి ప్రజలకు విముక్తి కల్పించడం కోసం పార్లమెంటు బాండెడ్ లేబర్ సిస్టమ్(అబాలిషన్)చట్టం, 1976ను అందుబాటులోకి తీసుకొచ్చిందని పేర్కొన్నారు. సంబంధిత చట్టాన్ని పక్కాగా అమలు చేయటం ద్వారా వెట్టిచాకిరీని రూపుమాపాలని సూచించారు. వెట్టిచాకిరీ పద్ధతిలో ఎవరినైనా ఇబ్బంది పెడితే మూడేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా ఉంటుందని ఆమె తెలిపారు. అనంతరం అధికారులందరి చేత అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎస్. మోహన లక్ష్మి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎస్. మోహన లక్ష్మి, అనకాపల్లి కె.ఆర్.ఆర్.సి. ప్రత్యేక ఉప కలెక్టర్, ఎ. మహేష్, అనకాపల్లి దిశా డీఎస్పీ డి. రామవర్మ, అల్లూరి సీతారామరాజు జిల్లా ఐసీడీఎస్ పీడీ ఎన్. స్వరాజ్యలక్ష్మి, న్యాయ అధికారులు, రెవెన్యూ, పోలీసు, విద్యాశాఖ, లేబర్ విభాగాల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.